సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 5 । మే । 2024



అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జి.కొండూరు: చెక్‌పోస్టుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరబ్‌శర్మ సూచించారు. గంగినేని చెక్‌పోస్టును ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.



బీజేపీ అధికారంలోకి వస్తే..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్ల పరిరక్షణకు బీజేపీతో పాటు ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేనను ఓడించాలని జూపూడి ప్రభాకరరావు కోరారు.

-8లో▸



	కనిష్ఠం	గరిష్ఠం
మచిలీపట్నం	30	36
గుడివాడ	30	40
నందిగామ	30	42.1
జగ్గయ్యపేట	31	42

న్యూస్‌రీల్

ప్రధాని పర్యటన భద్రత ఏర్పాట్లు పరిశీలన



గన్నవరం: ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయవాడ పర్యటన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ముందస్తు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ నేతృత్వంలో అధికారుల బృందం విమానాశ్రయంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రధాన మంత్రి పర్యటనలో భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రధాని కాన్వాయ్ కొనసాగే జిల్లా పరిధిలోని రోడ్డు మార్గాన్ని కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో గన్నవరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, చిన్నఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిని సందర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వైద్య సదుపాయలను అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. డీఎస్పీ జయసూర్య, ఎయిర్‌పోర్ట్ భద్రతాధికారి వెంకటరత్నం, ట్రైనీ డీఎస్పీ శ్రీవేద తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

పెనమలూరు: వైద్య విద్యలో ప్రవేశానికి నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్టు (నీట్)ను నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని నీట్ కోఆర్డినేటర్ బర్నబాస్ శనివారం తెలిపారు. నీట్ అండర్ గ్రాడ్యుయేట్ 2024 పరీక్ష ఆదివారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో జరుగుతుందని పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరుగుతుందని వివరించారు. జిల్లాలో మొత్తం 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 15 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఉదయం 11.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 1.40 గంటల తరువాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమని స్పష్టంచేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు రావాలని సూచించారు. 34 మంది పరిశీలకులు ఈ పరీక్షలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు నిబంధనలు కచ్చితంగా పటించాలన్నారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బెజవాడ దుర్గమ్మను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం సత్యనారాయణను వేద పండితులు ఆశీర్వదించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. వేసవిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీని కమిషనర్ సత్యనారాయణ పరిశీలించారు. భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న సాయిధరమ్‌తేజ

సినీ నటుడు సాయిధరమ్ తేజ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గమ్మను శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

ఆధారాల్లేని రూ. 84,100 స్వాధీనం

కురుమద్దాలి(పామర్రు): ఎటువంటి ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ. 84,100 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పామర్రు మండలం కురుమద్దాలి ఫ్లై ఓవర్ వద్ద శనివారం ఎఫ్ఎస్‌టీ అధికారులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో మచిలీపట్నం నుంచి గుంటూరు వెళ్తున్న కారులో ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.84,100 నగదు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి నగదును అందించారు.



పెడన: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న వస్తే పింఛను కష్టాలు తప్పుతాయని అవ్వాతాతలకు చెప్పారు.

ప్రచార పర్వం



కోడూరు: అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు శనివారం చేపట్టిన రోడ్‌షోకు అడుగడుగున జన నీరాజనం పలికారు.



నందివాడ: గుడివాడ నియోజకవర్గం నందివాడ మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా 3,175 మంది పీవోలు, ఏపీవోలు
- ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు 2,700 మంది
- కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ



పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. మొదటి రోజు పోలింగ్ ఆఫీసర్లు, అదనపు పోలింగ్ ఆఫీసర్లకు షెడ్యూల్ కేటాయించారు. ఈ షెడ్యూల్ ప్రకారం నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో పీవోలు, ఏపీవోలు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియను నిర్వహించారు. ఆది, సోమవారాల్లోనూ షెడ్యూల్ ప్రకారం పోలింగ్ సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

నియోజకవర్గాల వారీగా....

జిల్లా వ్యాప్తంగా 3,175 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 2,700 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గన్నవరం నియోజకవర్గంలో 318 మందికి 299 మంది, గుడివాడలో 524కు గానూ 428 మంది, పెడనలో 275 మందికి గానూ 212 మంది, మచిలీపట్నంలో 985 మందికి గానూ 781 మంది, అవనిగడ్డలో 266 మందికి గానూ 246 మంది, పామర్రులో 266 మందికి గానూ 246 మంది, పెనమలూరు 544 మందికి గానూ 88 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో జరిగిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు, సంబంధిత ఫారాలు, బ్యాలెట్లు ఏర్పాటు చేసిన విధానాన్ని ఆయన పరిశీలించి అధికారులు, సిబ్బందికి సూచనలు జారీ చేశారు. పోలైన ఓట్లు ఇన్‌వాలిడ్ కాకుండా ఉద్యోగులకు నిబంధనలు తెలియజేయాలని సూచించారు.



పామర్రు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న మహిళా ఉద్యోగి

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

పెనమలూరు: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్‌కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఓటింగ్‌కు వేర్వేరు కంపార్టుమెంట్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఓటు వేసే వారు ఫారాలు, బ్యాలెట్‌లు ఉంచే కవర్లపై బ్యాలెట్ నంబర్లు సక్రమంగా వేయాలని ఆదేశించారు. అలాగే సంతకాలు కూడా చేసి పోల్ అయిన ఓటు ఇన్‌వ్యాలిడ్ అవ్వకుండా ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మొదటి రోజు శనివారం పోలింగ్ విధుల్లో ఉన్న ప్రొసీడింగ్ అధికారులు, సహాయ ప్రొసీడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు జిల్లాలో అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో ఓటు వినియోగించుకోవటానికి ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 5వ తేదీన ఇతర పోలింగ్ సిబ్బంది (ఓపీఓలకు), 6వ తేదీన అత్యవసర సర్వీసులు, పోలీసు, డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు, ఇతర సిబ్బంది అసెంబ్లీ కేంద్రాల్లో ఓటు వేయాలని చెప్పారు. జిల్లాలో పని చేస్తూ ఇతర జిల్లాలో ఓటు కలిగి ఉన్న వారు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవటానికి జిల్లా కేంద్రం మచిలీపట్నంలో 6వ తేదీన పాండురంగా మున్సిపల్ హైస్కూల్‌లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉన్న వారు తప్పనిసరిగా తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్‌వోలు పీఎన్‌డీ ప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల సత్తా



రెజ్లింగ్ రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్-17 రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్తూరులో ఈ నెల మూడు, నాలుగు తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల బాలుర విభాగంలో విజయవాడకు చెందిన ఎస్.రోహిత్‌కుమార్ బంగారు పతకం సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాడు. నగరానికి చెందిన ఎస్.జైవిజయ్‌కుమార్ రజితం, నున్నకు చెందిన డి.రామ్‌చంద్‌ఈశ్వర్, టి.శ్యామ్, వై.జిక్రిరెడ్డి కాంస్య పతకాలు సాధించారు. బాలికల విభాగంలో డి.శరణ్య, ఎస్.కె.సదా రజితం, బి.పుష్ప, వి.గీతశ్రీ, డి.భవాని కాంస్య పతకాలు సాధించారు. మరిన్ని పతకాలు పొందాలని ఆకాంక్షించారు.

పవన్ సభ అట్టర్ ప్లాప్

- గుడివాడలో పేలవంగా పవన్ బహిరంగ సభ
- జనం లేక వెలవెలబోయిన వైనం
- కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము తీరుపై జనసేన, బీజేపీ నేతల పెదవి విరుపు



గుడివాడలో జనం లేక వెలవెలబోతున్న పవన్ బహిరంగ సభ

గుడివాడరూరల్: వారాహియాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శనివారం గుడివాడ నెహ్రూచౌక్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభ అట్టర్ ప్లాప్ అయింది. సభకు భారీ ఏర్పాట్లు చేశామని కూటమి నేతలు చెప్పిన మాటలన్నీ ఒట్టివేనని తేలిపోయాయి. ఉదయం 11 గంటలకు పవన్ హాజరవుతారని చెప్పగా 12.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. పవన్ వచ్చే సరికి పట్టుమని మూడు వేల మంది కూడా లేరు. దీంతో కూటమి అభ్యర్థులు, నాయకులపై పవన్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పవన్ ప్రసంగం మొదలయ్యే సమయానికి కేవలం 2 వేల మంది జనాలు లేకపోవడంలో పవన్ ప్రసంగం చప్పగా సాగింది. సభా ప్రాంగణం వద్ద సరిగా ఏర్పాట్లు కూడా చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ సభ ఫెయిల్ కావడంతో కూటమి నేతల్లో ఓటమి భయం నెలకొంది.

కుమ్ములాటలే కారణమా...?

పవన్ బహిరంగ సభ ఫెయిల్ కావడానికి నియోజకవర్గం టీడీపీలో కుమ్ములాటలే కారణమా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెనిగండ్ల రాము ఒంటెద్దు పోకడలతోనే టీడీపీలో కుమ్ములాటలు ఎక్కువయ్యాయని ఆ పార్టీ నాయకులే బాహాటంగా పేర్కొంటున్నారు. తాను జీతం ఇచ్చి నియమించుకున్న వారిని తప్ప జనసేన, బీజేపీ నేతలతో పాటు టీడీపీ సీనియర్ నాయకులను రాము పట్టించుకోవడం లేదని అంటున్నారు. కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదనేది వాపోతున్నారు. కేవలం తన సామాజిక వర్గానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని, బీజేపీ, జనసేన దళిత నేతలకు కనీస గుర్తింపు ఇవ్వడం లేదని చెబుతున్నారు. తాము పార్టీ కోసం కష్టపడుతున్నా పొత్తు ధర్మాన్ని పాటించకుండా తమను దూరం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు సైతం పిలవకుండా రాము వ్యవహరిస్తున్న తీరుపై కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రచారానికి వచ్చిన సమయంలోనూ కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై సొంత పార్టీతో పాటు జనసేన, బీజేపీ నాయకులు పెదవి విరుస్తున్నారు.

తూతూ మంత్రంగా సాగిన పవన్ ప్రసంగం

బహిరంగ సభలో జనం లేకపోవడంతో పవన్ ప్రసంగం తూతూ మంత్రంగా సాగింది. ఎప్పుడు గుడివాడ వచ్చిన ఒకే విధంగా పవన్ మాట్లాడటం, స్థానిక నాయకులు ఇచ్చే పేపర్లు చదివి వెళ్లిపోవడం మినహా గుడివాడకు తాము ఏమి చేస్తామనే అంశం చెప్పకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన ప్రతిసారీ పేకాట, మట్టికి సంబంధించి మాత్రమే పవన్‌తో గుడివాడ నాయకులు మాట్లాడించడం పట్ల ప్రజలు పట్టించుకోవడం మానేశారు. చంద్రబాబు, టీడీపీ అగ్ర నాయకులు వస్తే మాత్రం మంచినీళ్ల ప్రాయంగా రాము డబ్బు ఖర్చు పెట్టే వాడని, పవన్ వస్తే కనీస ఏర్పాట్లు చేయడం అటు ఉంచితే ప్రజలను సైతం తీసుకురావడంలో విఫలమయ్యాడని విమర్శిస్తున్నారు. మరోసారి ఓటమి ఖాయమనే భావనలోకి కూటమి నేతలు వచ్చినట్లు సమాచారం. ఏది ఏమైనా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిని ఎదుర్కొనే సత్తా టీడీపీకి లేదని, మరోసారి ఎమ్మెల్యేగా కొడాలి నాని గెలుపును ఎవరూ అడ్డుకోలేరని ప్రజలు పేర్కొంటున్నారు.

రేపు జాతీయస్థాయి నృత్య పోటీలు

గుడివాడ టౌన్: కళాజ్యోతి నృత్య సమ్మేళనం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ జాతీయ స్థాయి నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని అలంకృత ఫంక్షన్ హాల్లో ఉదయం 7 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆసక్తి గల కళాకారులు, విద్యార్థులు, నృత్యాభిమానులు పాల్గొనాలని కోరారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీకి మాల మహానాడు మద్దతు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సామాజిక న్యాయం పాటిస్తూ, అభివృద్ధి - సంక్షేమం రెండు కళ్లుగా పనిచేస్తున్న దళిత పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రాన్సిస్ రాజు తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 500 జనాభా కలిగిన దళితవాడలను ప్రత్యేక పంచాయతీగా గుర్తిస్తామని మేనిఫెస్టోలో పెట్టిన దళిత పక్షపాతి వైఎస్ జగన్‌కు దళితులందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. జగన్‌ను తిరిగి సీఎంగా చేయాలన్నారు.

ప్రజాదర్శకుడు దాసరి నారాయణరావు



పురస్కార గ్రహీతలతో విజయలక్ష్మి, బలరామకృష్ణ మూర్తి తదితరులు

విజయవాడ కల్చరల్: దాసరి నారాయణరావు ప్రజాదర్శకుడని ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.బలరామకృష్ణమూర్తి తెలిపారు. మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం, సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో దాసరి జయంతి, దాసరి కళారత్న, జీవన సాఫల్య పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు చిత్ర సీమలో దాసరి యుగం స్వర్ణ యుగమని చెప్పారు. కొమ్మినేని రత్న కుమారి, రోజా ప్రసన్నత, ఉమా బలరాం, రాబర్ట్ సునీల్, శిల్ప, సుశీల్‌కు 2024 సంవత్సరానికి దాసరి నారాయణరావు జీవన సాఫల్య పురస్కారాలు, ఎం.ఎస్.ఎన్.రావు, డాక్టర్ ఎం.ప్రభాకర్, బడుగు నాగేశ్వరరావు, చందు ఆంజనేయులు, రాజబాబు, చెన్నయ్య, ప్రతాప్‌కుమార్ సత్యనారాయణ, సుజాతకు కళారత్న పురస్కారాలు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 60, 64 డివిజన్లకు చెందిన 150 మంది టీడీపీ, జనసేన పార్టీ నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాలు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్కే ఆధ్వర్యంలో 64వ డివిజన్ జనసేన జనరల్ సెక్రటరీ బన్నీ నాయుడు, 50 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ కాజా, కోఆప్షన్ సభ్యులు అలీమ్, నండెపు జగదీష్, యరగోర్ల శ్రీరాములు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

గుణదల(విజయవాడ తూర్పు): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గిరిపురంలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టేకేటి ఇస్సాక్ (23) బందర్ రోడ్డు పీవీపీ మాల్ సమీపంలోని ఒక ఇంటర్‌నెట్ సెంటర్‌లో పనిచేస్తుంటాడు. తండ్రి అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. చేస్తున్న ఉద్యోగంలో సరిపడా జీతం రాకపోవడంతో గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో తన అవసరాల నిమిత్తం ఆన్‌లైన్ యాప్ ద్వారా లోన్ తీసుకున్నాడు. సకాలంలో లోన్ చెల్లించకపోవడంతో బ్యాంక్ నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఇస్సాక్ శుక్రవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి తోబుట్టువులు ఎంత కొట్టినా తలుపుతీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీ నుంచి చూస్తే ఉరికి వేళాడుతున్న ఇస్సాక్ కన్పించాడు. దీంతో మాచవరం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా కేవలం బ్యాంక్ సిబ్బంది ఒత్తిడి కారణంగానే ఇస్సాక్ మృతి చెందాడని బాధితులు చెబుతున్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లన్నీ రద్దే

ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు

గన్నవరం: కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేస్తుందని ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లను కాపాడుకునేందుకు రానున్న ఎన్నికల్లో బీజేపీతో పాటు ఆ పార్టీతో పొత్తులు పెట్టుకున్న టీడీపీ, జనసేనలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా గన్నవరంలోని రోటరీ ఆడిటోరియంలో శనివారం దళితుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపూడి సమక్షంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్), మాల మహానాడు నేతలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ రావులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం జూపూడి మాట్లాడుతూ.. దళితులను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు నడిపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి చేకూర్చడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచారని తెలిపారు. కానీ 14 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు దళితులకు చేసిందేమి లేదన్నారు. చంద్రబాబు పచ్చి అవకాశవాదని, 2019 ఎన్నికల ముందు బీజేపీ, మోదీని బూతులు తిట్టి మళ్లీ వారితోనే చేతులు కలిపారని దుయ్యబట్టారు. పవన్‌కల్యాణ్ మాత్రం కేవలం చంద్రబాబును సీఎం చేయడానికే జనసేన పార్టీ పెట్టారని విమర్శించారు.



వంశీమోహన్, సింహాద్రికి మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నేతలు

వంశీ సేవలు ప్రశంసనీయం..

నియోజకవర్గ ప్రజలకు గత 18 ఏళ్లుగా వంశీమోహన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని జూపూడి అన్నారు. అంబేడ్కర్ భావజాలం కలిగిన వంశీ ఎప్పుడు పేదల పక్షాన నిలుస్తారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వంశీమోహన్ విజయానికి మాల, మాదిగలందరూ కలిసికట్టుగా పనిచేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి జయప్రకాష్ కెనడి, మాల మహానాడు రాష్ట్ర నాయకులు మెండెం రాంబాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, కేసరపల్లి సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ సెంటర్ పరిశీలన

గన్నవరం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. పోస్టల్ ఓటింగ్ కోసం అధికారులు చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీలకు వేర్వేరుగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలిశర్మ వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇన్‌వ్యాలీడ్ కాకుండా ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకునే విధంగా సూచనల బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ విధులు కేటాయించిన ప్రొసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రొసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 5న ఓపీఓలకు, 6న పోలీస్ సిబ్బందికి, ఎసెన్షియల్ సర్వీసెస్, డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం ఈ సెంటర్లను వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో పనిచేస్తున్న ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం మచిలీపట్నంలోని పాండురంగ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఏపీఓ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సంపూర్ణ అవగాహన అవసరం

మైలవరం ఎన్నికల అధికారి పి. సంపత్ కుమార్

మైలవరం: పీఓలు, ఏపీఓలు ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గం ఎన్నికల అధికారి పి. సంపత్ కుమార్ అన్నారు. మైలవరం నియోజకవర్గంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ హాలులో శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. బాధ్యతాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారులు పాత్ర కీలకమన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో పోలింగ్ అధికారుల విధులు అత్యంత ప్రతిష్టాత్మకం అని పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమన్నారు. ఒక్క తప్పు కూడా దొర్లకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే పూర్తి అధికారం ఉంటుందన్నారు. ఉదయం నుంచే వీలైనంత వరకు వేగంగా పోలింగ్ ప్రక్రియ జరపాలని సూచించారు. పోలింగ్ అధికారులు తమ వ్యక్తిగత అభిప్రాయాలు, అభిమానాన్ని ఎక్కడా ప్రదర్శించకూడదన్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో పోలింగ్‌కు 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహించాలని తెలిపారు. మాక్ పోల్ అనంతరం ఈవీఎంలలో డేటాను తొలగించాలని, వీవీ ప్యాట్ ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. ముందు రోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5.30గంటలకు మాక్ పోల్ జరుగుతుంది కాబట్టి ముందురోజు రాత్రే పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌లు, తహసీల్దార్‌లు రాజేశ్వరరావు, వీవీఎల్. నరసింహారావు, ఝాన్సీలక్ష్మీ, సహాయ రిటర్నింగ్ అధికారి కొండపల్లి మున్సిపల్ కమిషనర్ వై.శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సంపత్‌కుమార్

కూటమికి పగ్గాలిస్తే రిజర్వేషన్లకు ముప్పు

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిషప్ జాన్ బెన్నీ లింగం

కంకిపాడు: కూటమి మాటలు నమ్మి పగ్గాలు అప్పగిస్తే అన్ని వర్గాల రిజర్వేషన్లకూ ముప్పు వాటిల్లుతుందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిషప్ జాన్ బెన్నీ లింగం అన్నారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలోని నెప్పల్లి, చలివేంద్రపాలెం గ్రామాల్లో మంత్రి జోగి రమేష్‌తో కలిసి శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెన్నీ లింగం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో బీజేపీకి 400 సీట్లు పైబడి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్ మైనార్టీ, ముస్లిం మైనార్టీల రిజర్వేషన్‌లను తొలగించి వారిపై ఉక్కుపాదం మోపటం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా జతకట్టాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను రావణకాష్టం చేసేందుకు కూటమి కుట్రపన్నుతున్నాయన్నారు. హిందూ, క్రిస్టియన్, ముస్లిం వర్గాల మధ్య చిచ్చు రగిల్చి అణచివేయాలని చూస్తున్నారన్నారు. కూటమి కుట్రలను భగ్నం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు విజయాన్ని అందించి సంక్షేమ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బాలశౌరి, కొల్లు రవీంద్రపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, బందరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్రపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ నాయకులు అదనపు ముఖ్య ఎన్నికల అధికారి ఎంఎన్ హరీంద్రప్రసాద్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా 2024 మే 2వ తేదీన మచిలీపట్నం పోలీస్‌స్టేషన్, ఎస్పీ కార్యాలయం ఎదుట బాలశౌరి, కొల్లు రవీంద్ర కార్యకర్తలతో ధర్నా నిర్వహించటం పోలీస్ సిబ్బందిపై దౌర్జన్యానికి దిగి, వారితో వాగ్వావాదం చేసి, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటన జరిగి 48 గంటలు గడిచినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లు, తగిన ఆధారాలు కూడా సమర్పించారు. ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ బందరు అధ్యక్షుడు షేక్‌సలార్‌దాదా, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు అంకరాజు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

విజయవాడ పోలీస్ కమిషనర్ రామకృష్ణ

పెండ్యాల(కంచికచర్ల): పది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయని, ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ అన్నారు. కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామంలో శనివారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అనంతరం గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ మేరకు సీపీ మాట్లాడుతూ, గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టామని ప్రజలంతా సహకరించాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని ఆ గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులను సీఐ, ఎస్‌ఐలు పోలీస్ స్టేషన్‌లకు పిలిపించి ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా చూడాలని అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో పోలీస్ కవాతు మూడు దఫాలుగా నిర్వహించామన్నారు. ఓటర్లకు డబ్బులు కాని, ఇతర వస్తువులు ప్రలోభపెట్టినా అటువంటి వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో అన్ని వీధుల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ బి. రవి కిరణ్, నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పి. చంద్రశేఖర్, నందిగామ సర్కిల్ సీఐ హనీష్, ఎస్‌ఐలు పీవీఎస్ సుబ్రహ్మణ్యం, రామారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు

మైలవరం: జాతీయ విశ్వ విద్యాలయాల నెట్ బాల్ పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎస్‌వీ భార్గవి, కె. పావని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో ఇటీవల నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల పోటీలలో పాల్గొని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరపున జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వివరించారు. మే 5వ తేదీ నుంచి కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ నందు జరిగే ఆల్ ఇండియా అంతర్ యూనివర్సిటీ మహిళల నెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ మేజర్ మన్నే స్వామి, అధ్యాపకులు అభినందించారు.

ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసైన వ్యక్తి అప్పులపాలవడంతో ఒత్తిడి తట్టుకోలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని రాణిగారితోటలో శనివారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు రాణిగారితోట, మాదంశెట్టి సీతయ్య వీధిలో మేకల చంద్రశేఖర్ అలియాస్ చందు(30) కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతను తన తండ్రి మేకల సత్యనారాయణతో కలిసి నక్కలరోడ్డులో ఎస్ఎస్‌వీ ఫార్మాలో డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా అతను క్రికెట్ బెట్టింగ్‌లకు వ్యసనపరుడై బానిసగా మారాడు. అప్పుచేసి మరీ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడ్డాడు. క్రికెట్ బుకీల నుంచి బెదిరింపులు రావడంతో పాటు అప్పుల ఒత్తిళ్లు పెరిగాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఫార్మా వద్దకు వెళ్లి తండ్రిని డబ్బులు ఇవ్వమని గొడవపడ్డాడు. ఈ విషయం అతని తల్లి దుర్గాదేవికి తెలియడంతో మందలించింది. శనివారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో ఆమె భోజనం చేయమని పిలవడానికి పై అంతస్తులో ఉన్న అతని వద్దకు వెళ్లింది. అక్కడ రూమ్‌లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చూసి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన చంద్రశేఖర్(ఫైల్)

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్రమశిక్షణ, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రశాంత వాతావరణంలో జరిగే ఎన్నికల నిర్వహణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు పేర్కొన్నారు. ఈ నెల 13న జరుగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించిన విధులలో 1,250 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొననున్న నేపథ్యంలో జిల్లాలోని వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శనివారం సాయంత్రం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ స్టేషన్ల వద్ద క్యూ లైన్లను సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, గర్భిణుల వంటి వారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహాయ సహకారాలను అందించాలని సూచించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సహకారం, సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, జిల్లా పోలీస్ నోడల్ అధికారి ఎం. కృష్ణమూర్తి నాయుడు, పోలీస్ అధికారులు కాశీ విశ్వనాథ్, హరికృష్ణ, వివిధ కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు.

'తూర్పు'లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం

మీట్ ది ప్రెస్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వచ్చే ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి తీరుతామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమమే తమ అజెండా అని అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శనివారం దేవినేని అవినాష్ మీట్ ది ప్రెస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తన నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. 2 వ డివిజన్ నుంచి 22 వ డివిజన్ వరకు ప్రజలకు కావాల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు సమకూర్చామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, కాలనీలు, కొండ ప్రాంతాల్లో మెట్ల మార్గం, రెయిలింగ్, కృష్ణా కరకట్ట ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ ఇలా ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు గతంలో ఎవరూ చేయని విధంగా చేసి చూపించామన్నారు. ఈ నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో తాను ఒక్కో ఇంటికి నాలుగు సార్లు తిరిగానన్నారు. ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని పరిష్కరించామని, అందుకే ప్రజల మద్దతు తమకే ఉందన్నారు. కొండపైనే హెల్త్ సెంటర్ కూడా ఏర్పాటు చేశామన్నారు.

కృష్ణా కరకట్టకు రిటైనింగ్ వాల్ నిర్మాణం

కృష్ణా కరకట్టపై రిటైనింగ్ వాల్ నిర్మాణం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అని అన్నారు. 2019, 20 సంవత్సరాల్లో వరదలు వచ్చాయని, ఆ సమయంలో మంత్రులతో కలిసి సీఎం వైఎస్ జగన్ వద్దకు వెళ్లి కోరగా పాదయాత్రలో ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలబెట్టుకుంటూ కరకట్ట రిటైనింగ్ వాల్ నిర్మాణం చేశారన్నారు.

రూ.2 కోట్లతో షాదీఖానా

మైనార్టీలు నివసించే లబ్బీపేట ప్రాంతంలో ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న స్థలాన్ని బదలాయించి రూ.2 కోట్లతో షాదీఖానా నిర్మించామన్నారు. రెల్లి కాలనీ, పోలీసు కాలనీ, భ్రమరాంబపురం ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించామన్నారు. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉండి గద్దె రామ్మోహన్ నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. తూర్పు నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిన అసమర్థ ఎమ్మెల్యే అని విమర్శించారు. చెప్పుకోవడానికి ఏమీ లేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గొడవలు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. తనకు కాల్‌మనీ సెక్స్ రాకెట్ వ్యవహారాలు లేవని, పేకాట శిబిరాలు లేవని, తనపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవని స్పష్టం చేశారు.

ఓటు సద్వినియోగంతో సుపరిపాలన

తొలిసారి ఓటుహక్కు పొందిన యువత మనోగతం



కొత్త ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నరేందర్ సింగ్ బాలి

పెనుగంచిప్రోలు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలి. సేవాతత్పరులు, నిస్వార్థులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకుంటే దేశం ప్రగతిపథంలో పయనిస్తుంది. ఓటుహక్కు పొందటంతోపాటు దానిని సద్వినియోగం చేసుకున్నప్పుడే సుపరిపాలన సాకారమవుతుంది. ప్రస్తుతం 2024 సార్వత్రిక ఎన్నికలు మే13న జరగనున్నాయి.

ప్రలోభాలకు గురికాకూడదు



ప్రజాప్రతినిధులను ఎన్నుకోవటంలో ఓటు విలువ తెలుసుకున్నా. ప్రలోభాలకు దుర్వినియోగమవుతున్న పరిస్థితి చూస్తున్నాం. ఎవరైతే ప్రజల బాగోగుల గురించి, అభివృద్ధి గురించి ఆలోచిస్తారో వారికే నా మొదటి ఓటు. ఓటు హక్కును దుర్వినియోగం చేయను.

–సంభంగి సౌమ్యశ్రీ, పీజీ, జగ్గయ్యపేట

ఓటు సద్వినియోగం చేసుకుంటా



తొలిసారి ఓటు హక్కు వచ్చింది. ఓటు వినియోగంలో సిఫార్సులు అనుసరించను. ఫలానా వారికి వేయమని చెప్పినా వినను. ఏ అభ్యర్థి వల్ల మేలు కలుగుతుందో గమనించి వారికే ఓటు వేస్తా. నా మిత్రులు కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తా.

–పులికొండ అనూహ్య, ఎమ్మెస్సీ, పెనుగంచిప్రోలు

ఉజ్వల భవిత కోసం...



యువత ఉజ్వల భవితకు ఓటు అవసరం. గతంలో ఓటు హక్కు నమోదుకు అంత ప్రాధాన్యం ఉండేది కాదు. ప్రస్తుతం పెరిగిన చైతన్యంతో యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎదురు చూస్తున్నారు. యువత చైతన్య బాటలో పయనిస్తే నీతివంతమైన పాలనకు నాంది పలకవచ్చు.

–కల్లూరి బ్రహ్మతేజ, పెనుగంచిప్రోలు



అందాల అవనిగడ్డ

ఎన్నో ప్రత్యేకతల మణిహారం

- చోళులు, కాకతీయులు ఏలిన ప్రాంతం
- పోరాటాల పురిటిగడ్డ
- ప్రకృతి సోయగాలకు నెలవు దివిసీమ
- ఉపాధ్యాయుల ఫ్యాక్టరీగా పేరు
- శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద గ్రంథరచనకు శ్రీకారం
- బౌద్ధుల కాలంలో ఘంటసాల ఓడరేవు నుంచి విదేశాలకు వ్యాపారం

అవనిగడ్డ: ఎన్నో ప్రత్యేకతల మణిహారం అవనిగడ్డ నియోజకవర్గం. గతంలో ఇది దివి నియోజకవర్గంగా ప్రకృతి అందాలకు నెలవుగా ఉండేది. నియోజకవర్గంలోని శ్రీకాకుళం ఒకప్పుడు ఆంధ్రుల తొలి రాజధానిగా గుర్తింపు పొందింది. ఒకజాతి పేరుతో శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు ఆలయం ఉండటం ప్రత్యేకత. ఆంధ్ర భోజుడు శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద గ్రంథ రచనకు శ్రీకాకుళంలోనే శ్రీకారం చుట్టారు. ఒకప్పుడు ఓడరేవుగా ప్రసిద్ధిగాంచిన కంటకశైలం (నేటి ఘంటసాల) బౌద్ధక్షేత్రంగా విరాజిల్లింది. యార్లగడ్డ సంస్థానీయులు దేవరకోటను కేంద్రంగా చేసుకుని పాలించగా, కాకతీయుల (గణపతి దేవుని) కాలంలో గణపేశ్వరం ఎంతో ప్రాచుర్యం పొందింది. మహారాష్ట్రలోని మహాబలేశ్వరంలో జన్మించిన కృష్ణానది కోడూరు మండలం హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో (సాగరసంగమం) కలుస్తుంది. పోరాటాలగడ్డగా పేరొందిన దివిసీమ ఎందరో కమ్యూనిస్టు యోధులకు జన్మనిచ్చింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అవనిగడ్డ కోచింగ్ సెంటర్లకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అవనిగడ్డలోని పలు కోచింగ్ సెంటర్లు వేలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులను తయారు చేశాయి. కృష్ణా నదీ పాయల నడుమ పచ్చని అందాలతో కనువిందు చేసే దివిసీమ ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంగా చెప్పవచ్చు.

సరిహద్దులివి

మచిలీపట్నం రెవెన్యూ పరిధిలో ఉన్న 'అవనిగడ్డ'కు తూర్పున బంగాళాఖాతం, పడమర పామర్రు నియోజకవర్గంలోని మొవ్వ మండలం, ఉత్తరం బాపట్ల జిల్లా పెనుమూడి, దక్షిణం కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం ఉంది. 1934లో పులిగడ్డలో నిర్మించిన అక్విడెక్టు దివిసీమ ప్రజల దాహార్తిని తీరుస్తూ, రైతులకు సాగునీరు

అవనిగడ్డ మ్యాపు →



నియోజకవర్గంలో జూన్ 2019 నుంచి జనవరి 2024 వరకూ వివిధ పథకాలతో పొందిన లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి రూ.కోట్లలో
వైఎస్సార్ పెన్షన్ కానుక	40,508	328.11
జగనన్న అమ్మ ఒడి (3 విడతలుగా)	56,083	83.94
డిజిటల్ లైబ్రరీలు	24	3.84
నాడు-నేడు స్కూల్స్ (2 విడతలు)	176	42.81
జగనన్న విద్యా దీవెన	12,383	22.93
జగనన్న వసతి దీవెన	3,210	5.73
జగనన్న కాలనీ నివేశన స్థలాలు	8,929	46.07
జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు	2,267	40.80
జగనన్న కాలనీ లేఅవుట్స్ అభివృద్ధి		66.16
వైఎస్సార్ చేయూత	2,654	4.97
జగనన్న చేదోడు	3,197	3.26
వైఎస్సార్ నేతన్న నేస్తం	984	1.95
వైఎస్సార్ వాహనమిత్ర	2,900	2.49
వైఎస్సార్ కాపునేస్తం	13,010	19.51
వైఎస్సార్ చేయూత	26,536	49.75
రైతు భరోసా	31,439	116.32
సబ్సిడీ విత్తనాలు	16,837	2.14
ఇన్‌పుట్ సబ్సిడీ	28,182	22
పంటల బీమా	16,413	21.37
వైఎస్సార్ మత్స్యకార భరోసా	2,640	6.90
వైఎస్సార్ వేట విరామ భృతి	4,000	14.67
నాన్ డీబీటీ	84,643	18.42
అభివృద్ధి పనుల వివరాలు		
సీసీ రహదారుల నిర్మాణం	275	20.27
జెడ్పీ రహదారుల నిర్మాణం	36	1.42
సచివాలయ నిర్మాణాలు	77	30.35
రైతు భరోసా కేంద్రాలు	77	16.67
వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు	50	8.75
పాలశీతల కేంద్రాల నిర్మాణం	74	11.84
రెగ్యులేటర్ల నిర్మాణం	14	6.68
డ్రైనేజీల అభివృద్ధి	54	10.35

నాడు దివి.. నేడు అవనిగడ్డ

1952 –55 వరకూ 'అవనిగడ్డ' దివి నియోజకవర్గంగా ఉండేది. ఇందులో అవనిగడ్డ, నిడుమోలు రెండు నియోజకవర్గాలు కలిపి 'దివి'గా ఉన్నా ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండేవారు. అవనిగడ్డ నియోజకవర్గం జనరల్ కేటగిరిలో ఉండగా, నిడుమోలు ఎస్సీ రిజర్వుడుగా ఉండేది. గుంటూరు బాపనయ్య, పాటూరి రామయ్య వంటి ఆదర్శ రాజకీయ నాయకులు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన వారే. 1962లో అవనిగడ్డ నియోజకవర్గంగా ఏర్పడింది. ప్రస్తుతం 'అవనిగడ్డ'లో ఉన్న చల్లపల్లి, ఘంటసాల మండలాలు గతంలో 'నిడుమోలు'లో ఉండేవి. పునర్విభజన తరువాత అవనిగడ్డలో కలిశాయి. 1972లో అవనిగడ్డ నుంచి మండలి వెంకట కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికై ఉమ్మడి కృష్ణా జిల్లాలో అరుదైన రికార్డుని సొంతం చేసుకున్నారు. నియోజకవర్గంలో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాలు మొత్తం 576.72 కి.మీ విస్తీర్ణంలో ఉన్నాయి.

దర్శనీయ స్థలాలు, ప్రాంతాలు

నియోజకవర్గంలో పలు దర్శనీయ స్థలాలున్నాయి. వాటిలో మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయం, హంసలదీవిలోని వేణుగోపాలస్వామి, అవనిగడ్డలోని రాజశేఖరస్వామి ఆలయం, లక్ష్మీనారాయణస్వామి ఆలయం, ఘంటసాలలోని జలదీశ్వరాలయం, పెదకళ్ళేపల్లిలోని దుర్గా నాగేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి. సాగరసంగమం (కోడూరు), బౌద్ధక్షేత్రం (ఘంటసాల), గుల్లలమోద లైట్‌హౌస్, పులిగడ్డ అక్విడెక్టు, పులిగడ్డ పురాతన ఎత్తిపోతల పథకం, చల్లపల్లి రాజాకోట దర్శనీయ ప్రాంతాలు.



మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

హ్యాట్రిక్ గడ్డ

1955, 1962, 1967లో యార్లగడ్డ శివరామప్రసాద్, 1972, 1978, 1983లో మండలి వెంకట కృష్ణారావు కాంగ్రెస్ తరఫున, 1985, 1989, 1994లో సింహాద్రి సత్యనారాయణరావు టీడీపీ తరఫున హ్యాట్రిక్ విజయం సాధించారు. మండలి బుద్ధప్రసాద్ 1999, 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014లో టీడీపీ తరఫున మొత్తం మూడుసార్లు గెలిచారు. 2009లో అంబటి బ్రాహ్మణయ్య(టీడీపీ), 2013 ఉప ఎన్నికల్లో అంబటి శ్రీహరిప్రసాద్ (టీడీపీ) విజయం సాధించారు. 2019లో వైఎస్సార్ సీపీ నుంచి సింహాద్రి రమేష్‌బాబు గెలుపొందారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున సింహాద్రి రమేష్‌బాబు జనసేన తరఫున బుద్ధప్రసాద్ పోటీలో ఉన్నారు.

నియోజకవర్గ ప్రత్యేకతలివి



ఆనాటి రాజరిక పాలనకు దర్పణం చల్లపల్లి రాజా కోట

- కోడూరు మండలం పాలకాయతిప్ప వద్ద సాగరసంగమ ప్రాంతం.
- గురువులు(ఉపాధ్యాయుల) తయారీ కేంద్రంగా అవనిగడ్డకు ఆంధ్ర, తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు ఉంది.
- అవనిగడ్డ ప్రారంభంలో కరుణ, శాంతి, అహింసకు ప్రతీకగా ఉన్న ఏసుక్రీస్తు, బుద్ధుడు, గాంధీజీ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.
- 2007లో నిర్మించిన పులిగడ్డ - పెనుమూడి వారధి కృష్ణా-గుంటూరు జిల్లాలకు మణిహారంగా నిలిచింది.
- 2008లో నిర్మించిన పులిగడ్డ - విజయవాడ కరకట్ట రహదారి అవనిగడ్డ - విజయవాడ మధ్య 25 కి.మీ దూరాన్ని తగ్గించింది.
- వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన డెల్టా ఆధునీకరణ పనులకు పులిగడ్డ వార్పు వద్దనే అంకురార్పణ జరిగింది. శంకుస్థాపన సందర్భంగా పలుగు చేతబట్టి నిలుచున్న రాజశేఖరరెడ్డి విగ్రహం ప్రత్యేక ఆకర్షణ.
- కోడూరు మండలం ఉల్లిపాలెం వారధి వద్ద ఏర్పాటు చేసిన 50 అడుగుల తెలుగుతల్లి విగ్రహం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.
- వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దేశంలోనే తొలి మత్స్య పాలిటెక్నిక్ కళాశాల నాగాయలంక మండలం భావదేవరపల్లిలో ఏర్పాటు చేశారు.
- నాగాయలంక మండలం నంగేగడ్డ, భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెంలో ఓఎన్‌జీసీ గ్రిడ్‌లు ఉన్నాయి. ఇక్కడ నుంచి రోజూ గ్యాస్, ఆయిల్ ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతుంది.
- ఎన్టీ రామారావు హయాంలో తెలుగు మాగాణి సమారాధన పేరుతో చల్లపల్లిలో వేలాది మంది పేదల భూములకు పట్టాల పంపిణీ చేశారు.
- ఉప్పెన మృతుల జ్ఞాపకార్థం పులిగడ్డ వద్ద 100 అడుగుల ఎత్తులో పైలాన్ ఏర్పాటు చేశారు.

పంటల వివరాలివి



అవనిగడ్డలో మొత్తం 1,55,996 ఎకరాల భూమి ఉంది. వీటిలో 1.06 లక్షల ఎకరాల్లో వరి పండిస్తుండగా, 2,200 ఎకరాల్లో మామిడి, 468 ఎకరాల్లో సపోటా, 1,600 ఎకరాల్లో అరటి, 1,450 ఎకరాల్లో పసుపు, 2,146 ఎకరాల్లో కూరగాయలు, ఇతర పంటలు సాగవుతున్నాయి. 18,600 ఎకరాల్లో అటవీ భూములు, 6,480 ఎకరాలు బంజరు భూములు, 12,126 ఎకరాల్లో రొయ్యలు, చేపలు, పీతల చెరువులు సాగవుతున్నాయి.

అవనిగడ్డలో ప్రధాన అంశాలు

- చంద్రబాబు హయాంలో దివిసీమలోని వేలాది మంది రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన 22ఏ నిషేధిత భూముల (చుక్కల భూములు) సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారు. దీంతో నియోజకవర్గంలో 15,650 ఎకరాలకు విముక్తి కలిగింది.
- అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని మూడు నెలల క్రితం ఏర్పాటు చేయగా, రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.
- రూ.105 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న ఎదురుమొండి-ఏటిమొగ వారధి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. గత 60 సంవత్సరాలుగా ఉన్న డిమాండ్ నెరవేరడంతో పాటు ఎదురుమొండి దీవులకు రహదారి సౌకర్యం ఏర్పడనుంది.
- రూ.35 కోట్లతో అవనిగడ్డ - కోడూరు రహదారికి టెండర్లు పిలిచారు. సాంకేతిక అనుమతులు రాగానే పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



దివిప్రజల జీవనాడి పులిగడ్డ అక్విడెక్టు

ప్రభావితం చేసే కులాలివి

నియోజకవర్గంలో అత్యధికంగా కాపు సామాజిక వర్గం ఉంది. కాపులు, మత్స్యకారులు, మాల, మాదిగలు, గౌడ, కమ్మ సామాజిక వర్గ ఓటర్లు నియోజకవర్గంలో గెలుపు ఓటములను ప్రభావితం చేయనున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా కాపులు 69,645 మంది ఓటర్లుండగా, మత్స్యకారులు 35,980, మాల 21,528, మాదిగ 19,058, గౌడ 18,460, కమ్మ 13,456 మంది ఓటర్లు ఉన్నారు.


ఓటర్ల వివరాలు

అవనిగడ్డ నియోజకవర్గంలో మొత్తం 2,12,331

పురుషులు	మహిళా ఓటర్లు	ఇతరులు
1,04,568	1,07,745	18 మంది

నియోజకవర్గంలో మొత్తం జనాభా 2,68,771

పురుషులు	స్త్రీలు	ఇతరులు
1,33,833	1,34,927	21 మంది



వైఎస్సార్ సీపీలో జోష్ నింపిన రోడ్‌షో

- అవనిగడ్డ నుంచి పాలకాయతిప్ప మీదుగా కోడూరు వరకు...
- అడుగడుగునా ఎమ్మెల్యే సింహాద్రికి హారతులిచ్చిన మహిళలు
- పూల వర్షం కురిపించిన యువత
- దారి పొడవునా మిన్నంటిన జగన్నినాదాలు



అవనిగడ్డ మండలం కొత్తపేటలో ఎమ్మెల్యే సింహాద్రి రోడ్‌షో



రోడ్‌షోలో వేలాదిగా పాల్గొన్న పార్టీ శ్రేణులు

అవనిగడ్డ/కోడూరు: ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేపట్టిన రోడ్‌షోకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కోడూరు మండలంలోని పాలకాయతిప్ప మీదుగా తిరిగి కోడూరు వరకు జరిగిన ఈ రోడ్‌షోకి దారి పొడవునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీ కార్యాలయం వద్ద ఎంపీపీ తుంగల సుమతీదేవి ఎమ్మెల్యే సింహాద్రికి హారతి ఇచ్చిన అనంతరం యాత్ర ప్రారంభమైంది. అక్కడ నుంచి కొత్తపేట, తిప్పపాలెం, రామచంద్రాపురం, మాచవరం, వలందపాలెం, దక్షిణ చిరువోలులంక, వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, నారేపాలెం, గాబ, పిట్టల్లంక, సాలెంపాలెం, వేణుగోపాలపురం, ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప, దింటిమెరక, ద్వారక, ఊటగుండం, రామకృష్ణాపురం, ఇరాలి మీదుగా కోడూరు వరకూ సాగింది. రోడ్‌షో పొడవునా ఎమ్మెల్యేకి మహిళలు హారతులిచ్చి పూలమాలలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శనీయం అయ్యాయన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, బందరు పార్లమెంట్‌కు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

అడుగడుగునా జననీరాజనం

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు చేపట్టిన రోడ్‌షోకు ప్రజలు అడుగడుగునా జననీరాజనం పలికారు. ఉదయం 9.30 గంటలకు రమేష్‌బాబు పార్టీ శ్రేణులతో కలిసి అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నుంచి రోడ్‌షోను ప్రారంభించారు. ప్రతి గ్రామంలో రమేష్‌బాబుకు ప్రజలు బ్రహ్మరథం పలికారు. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు దారి పొడవునా పూలు జల్లుతూ 'జై జగన్' నినాదాలతో హోరెత్తించారు. పార్టీ శ్రేణులు, యువత నిర్వహించిన బైక్ ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు పార్టీ జెండాలు పట్టుకొని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. డప్పు కళాకారులు పార్టీ పాటలను ఆలపిస్తూ, వాటికి అనుగుణంగా ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు అమలు చేసిన పథకాలను వివరిస్తూ కళాజాత సభ్యులు గ్రామాల్లో ప్రదర్శనలిచ్చారు. భారీ ఎల్ఈడీ స్క్రీన్ వాహనాలపై అవనిగడ్డ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమ వివరాలను వీడియోల రూపంలో ప్రదర్శించారు.

నాంచారమ్మకు ప్రత్యేక పూజలు

కృష్ణాతీరంలో ప్రసిద్ధిగాంచిన విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మను రమేష్‌బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి రమేష్‌బాబుకు హారతి ఇచ్చి ఆలయంలోకి ఆహ్వానించారు. అర్చకుడు పార్థసారథి రమేష్‌బాబును శేషవస్త్రంతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువనేతలు సింహాద్రి వికాస్, కడవకొల్లు చైతన్య, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ కన్వీనర్లు పరిశె మాధవరావు, రేపల్లె శ్రీనివాసరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, దాసరి విజయకుమార్, సనకా సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌లు నలుకుర్తి పృథ్వీరాజ్, సైకం బాబూరావు, పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మందేసి చిందేసిన జన సైనికులు



గుడివాడ టౌన్: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శనివారం పట్టణానికి విచ్చేసిన సందర్భంగా జనసేన కార్యకర్తలు మందేసి చిందేశారు. టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సభకు వచ్చే వారికి సొమ్ములివ్వగా వారు మద్యం షాపుల ముందు క్యూ కట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ వీరవిహారం చేశారు. ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగజేస్తూ వారు చేసిన అల్లరికి ప్రజలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు హెచ్చరించినా పట్టించుకోకుండా తామింతేనంటూ జెండాలు ఊపుతూ చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురి చేశారు.